http://www.agnidharanews.com

# అగ్నిధార

సోమవారం 16 మార్చి 2026

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



# మోగిన నగారా

బంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించిన భారత ఎన్నికల సంఘం

అసోం: ఏప్రిల్ 9న పోలింగ్, కౌంటింగ్ మే 4న ఉంటుంది

కేరళ: పోలింగ్ ఏప్రిల్ 9, కౌంటింగ్ మే4న.

తమిళనాడు: పోలింగ్ ఏప్రిల్ 23, కౌంటింగ్ మే 4న.

బంగాల్: పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఉంటుంది. కౌంటింగ్ మే 4.

పుదుచ్చేరి: పోలింగ్ ఏప్రిల్ 9 , కౌంటింగ్ మే 4న

*దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అసోంతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఆదివారం విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ అన్ని ప్రాంతాల్లో మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. వివరాల్లోకి వెళితే, పశ్చిమ బెంగాల్‌లోని 294 స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 23న తొలి దశ, ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ నిర్వహిస్తారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. ఇక అసోం (126), కేరళ (140), పుదుచ్చేరి (30) అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది.*

2

# డైలమాకు తెర!

- ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్
- రైతు భరోసా డేట్ వచ్చేసింది
- ఈ నెల 22న రైతు నిధులు విడుదల
- సిద్దిపేట జిల్లా నుంచి విడుదల చేయనున్న సీఎం
- తొలి విడతగా ఒక ఎకరం వరకు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం



హైదరాబాద్

తెలంగాణ రైతులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. ఈ నెల 22వ తేదీన రైతు భరోసా మొదటి విడత నిధుల విడుదల చేయనుంది. సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో నిధులు విడుదల చేయనున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయనుంది కాంగ్రెస్ ప్రభుత్వం. అన్నదాతలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ నెల 22న రైతు భరోసా మొదటి విడత నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. సిద్ధిపేట జిల్లా నర్మెట్ట నుంచి రైతు భరోసా నిధులు సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేయనున్నారు. తొలి విడతగా 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి ఒక ఎకరం వరకు నిధులు విడుదల చేస్తారు. ఒక ఎకరం వరకు రైతు భరోసా కింద రూ.3,590 కోట్ల నిధులు విడుదల చేయనున్నారు. రెండో విడతగా మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్ల నిధులు, మొత్తం మూడు విడతల్లో రైతుల ఖాతాల్లోకి రూ.9 వేల కోట్లు విడుదల చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడతగా మొత్తం రైతు

- మిగతా3లో



## 'కేవైసీ అప్‌డేట్ చేయకపోతే కనెక్షన్ కట్

- తక్షణమే బుక్ చేసుకుంటేనే సిలిండర్'
- ఈ మెసేజ్‌తో తస్మాత్ జాగ్రత్త
- కేవైసీ అప్‌డేట్ చేయకపోతే గ్యాస్ కనెక్షన్ కట్ అని సందేశాలు
- ఫోన్లకు నకిలీ వెబ్‌సైట్ లింకుల్ని పంపుతున్న కేటుగాళ్లు
- సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ప్రకటనలు ఇస్తూ మోసాలు

హైదరాబాద్

ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో దేశంలో వంట గ్యాస్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. దీన్ని సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. సిలిండర్ల బుకింగ్ పేరుతో కొత్త

- మిగతా3లో

## రాహుల్ గాంధీ భారత్‌ను, ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారు



- బీజేపీని, ప్రధానిని వ్యతిరేకించే క్రమంలో, దేశాన్నీ రాహుల్ వ్యతిరేకిస్తున్నారు
- దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ నిరసన
- ఏఐ సదస్సు వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశమా?



## కాన్షీరామ్‌కు 'భారతరత్న' ఇవ్వండి

- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ
- భారత రాజకీయాల స్వరూపాన్నే కాన్షీరామ్ మార్చారని రాహుల్ కొనియాడారు
- తన ఉద్యమాల ద్వారా బహుజనుల్లో, పేదల్లో రాజకీయ చైతన్యం నింపారు



## విదేశాల్లో ఉన్న సొంత పౌరుల రక్షణలో భారత్ మేటి

- అంతర్జాతీయ మీడియా ప్రశంసలు
- తమ పౌరులనే కాకుండా, అత్యవసర సమయాల్లో విదేశీయులను సైతం సురక్షితంగా తరలించి భారత్ తన మానవతా దృక్పథాన్ని, అంతర్జాతీయ సంఘీభావాన్ని చాటుకుంటోంది
- వేగవంతమైన దౌత్యపరమైన చర్చలు, ప్రభుత్వ ఏజెన్సీల మధ్య అద్భుతమైన సమన్వయం, సమర్థవంతమైన సైనిక లాజిస్టిక్స్‌తో వేలాది మంది భారతీయులను ప్రమాదకర పరిస్థితుల నుంచి సురక్షితంగా స్వదేశానికి చేర్చగలిగింది

# నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

- ఈ నెలాఖరు వరకు అసెంబ్లీ!
- రేపటి నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగం
- సమావేశాల నిర్వహణపై అధికారులు, కార్యదర్శులతో గుత్తా సుఖేందర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ సమావేశం



హైదరాబాద్

నేటి నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. నేడు ఉదయం 11:45 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ప్రసంగిస్తారు. అనంతరం బీఏసీ సమావేశం నిర్వహిస్తారు. సభ ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై బీఏసీలో నిర్ణయం తీసుకుంటారు. ఈ నెల 20వ తేదీన శాసన సభలో, మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. బడ్జెట్ సమావేశాలు అత్యంత ముఖ్యమైనవని, ఎక్కువ రోజులు జరగడంతో పాటు ఎక్కువ సమయం పాటు

- మిగతా3లో



## ఎలక్షన్ నోటిఫికేషన్‌కు ముందు మమత కీలక ప్రకటన

- పురోహితులు, ముఅజ్జిన్‌ల గౌరవ వేతనం పెంపు
- హిందూ పురోహితులు, ముస్లిం ముఅజ్జిన్‌లకు గుడ్ న్యూస్
- రూ.500 చొప్పున గౌరవ వేతనాన్ని పెంచిన దీదీ

# మోగిన నగారా

దేశంలో మళ్లీ ఎన్నికల హడావుడి మొదలుకానుంది. బంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను భారత ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు ఆదివారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి షెడ్యూల్ అనౌన్స్ చేశారు. తమిళనాడు (234), పశ్చిమ బెంగాల్ (294), కేరళ (140), అస్సాం (126)తోపాటు పుదుచ్చేరి (30) రాష్ట్రాల్లో మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

అసోం: ఏప్రిల్ 9న పోలింగ్, కౌంటింగ్ మే 4న ఉంటుంది.
కేరళ: పోలింగ్ ఏప్రిల్ 9, కౌంటింగ్ మే4న.
తమిళనాడు: పోలింగ్ ఏప్రిల్ 23, కౌంటింగ్ మే 4న.
బంగాల్?: పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఉంటుంది. కౌంటింగ్ మే 4.
పుదుచ్చేరి: పోలింగ్ ఏప్రిల్ 9 , కౌంటింగ్ మే 4న.

పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మే, జూన్‌లలో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియను పూర్తి చేసిన ఎన్నికల సంఘం. క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఆయా రాష్ట్రాల్లోనూ ఇటీవల పర్యటించింది. "ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో పర్యటించాం. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు పార్టీల నేతల సలహాలు స్వీకరించాం. జిల్లా ఎలక్టోరల్ అధికారులు, ఎస్పీలు, ఐజీలు, డీఐజీలతోనూ భేటీ జరిగింది. చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, సీఎస్‌లు, డీజీపీలు, నోడల్



అధికారులతోనూ భేటీ జరిగింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి బీఎల్‌వోలకు మౌలిక సదుపాయాలు కల్పించాం. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికల కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నాం. ఓటరు అవగాహన కార్యక్రమాల అధికారులు, యువ ఓటర్లతో మాట్లాడాం" అని జ్ఞానేశ్? కుమార్? తెలిపారు.

నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో 17.4 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. యువత ముందుకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. భారత్‌లో ఎన్నికల నిర్వహణ అంటే ప్రజాస్వామ్య పండుగ అంటూ వ్యాఖ్యానించారు.

నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో ఇలా!
మొత్తం ఓటర్ల సంఖ్య – 17.4 కోట్లు
మొత్తం అసెంబ్లీ స్థానాలు 824
పోలింగ్ స్టేషన్లు – 2.19లక్షలు
ఎన్నికల అధికారులు – 25 లక్షలు

"ఐదు రాష్ట్రాల్లో మొత్తం 25 లక్షల మంది ఎన్నికల అధికారులు ఉన్నారు. 15 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 8.5 లక్షల మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. మొత్తం 2.18 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్, ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేయాలి. అభ్యర్థుల ఫొటోలు ఈవీఎంలపై ప్రదర్శించాలని సూచించాం. పోలింగ్ ఏజెంట్ల బూత్‌లు వంద మీటర్ల తర్వాత ఏర్పాటు చేయాలి. ఓటరు సేవల కోసం ఈసీఐనెట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వందశాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుంది" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు.

**బైపోల్స్**

ఆరు రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు జరగనున్నాయి. గోవా, గుజరాత్, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్క నియోజకవర్గం చొప్పున ఉపఎన్నిక జరగనుంది. కర్ణాటక, మహారాష్ట్రలో రెండు నియోజకవర్గాల చొప్పున ఉపఎన్నికలు జరుగుతాయి. కర్ణాటక(2), గోవా(1), నాగాలాండ్(1), త్రిపుర(1)లో ఏప్రిల్ 9న ఎన్నికల పోలింగ్ జరగనుంది. మహారాష్ట్ర(2), గుజరాత్(1)లో ఏప్రిల్ 23న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. మే 4న ఉపఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

# రాహుల్ గాంధీ భారత్‌ను, ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారతదేశాన్ని, దాని ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. ఇటీవలె దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సు వద్ద కాంగ్రెస్ యువజన విభాగం నేతలు చొక్కాలు లేకుండా నిరసనకు దిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అది వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదని హితవు పలికారు. విపక్షాలకు నిరసన తెలిపే హక్కు తప్పకుండా ఉంటుందని, కానీ ఏఐ సదస్సులాంటి చోట నిరసన తెలపడం సరికాదన్నారు. బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీలను వ్యతిరేకించే క్రమంలో, చివరకు భారతదేశాన్ని కూడా వ్యతిరేకించడాన్ని రాహుల్ గాంధీ మొదలుపెట్టారని అమిత్‌షా విమర్శించారు. ఆదివారం అసోంలోని గువహటిలో జరిగిన బహిరంగ సభ వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**రాహుల్ క్షమాపణ చెప్పకపోగా, నిరసనకారులను పొగిడారు**

"భారతదేశాన్ని ఏఐ విభాగంలో బలోపేతం చేసే లక్ష్యంతో ఏఐ ఇంపాక్ట్ సదస్సును దిల్లీలో నిర్వహించాం. కానీ కాంగ్రెస్ నేతలు అక్కడికి వెళ్లిపోయి, అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. వాళ్లలాగే మేం కూడా రాజకీయాల్లో ఉన్నాం. గతంలో ప్రతిపక్షంగా పనిచేసిన అనుభవం సైతం మాకుంది. కానీ ఇలాంటి నిరసన కార్యక్రమాలను మేం నిర్వహించలేదు. ఏఐ సదస్సు అనేది వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదు. యావత్ ప్రపంచం భారతదేశ ఏఐ టెక్నాలజీని, ఆవిష్కరణలను చూడటానికి, పెట్టుబడులు పెట్టడానికి ఆ సదస్సుకు వచ్చింది. దేశానికి ముఖ్యమైన ఆ సదస్సు దగ్గర



కాంగ్రెస్ యువజన విభాగం నేతలు అర్ధనగ్నంగా నిరసన తెలిపినందుకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పకపోగా, ఆ నిరసనలో పాల్గొన్నవాళ్లను ధైర్యవంతులని పొగిడారు. దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే కాంగ్రెస్ ఆ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది.ఏ బాధ్యతాయుత రాజకీయ పార్టీ కూడా అలా వ్యవహరించదని నేను భావిస్తున్నాను" అని అమిత్‌షా పేర్కొన్నారు.

**సత్తా ఉంటే బీజేపీని ఢీకొనండి**

నిజంగా సత్తాయే ఉంటే నేరుగా ప్రజాక్షేత్రంలో బీజేపీని ఢీకొనాలని కాంగ్రెస్ పార్టీకి అమిత్‌షా సవాల్ విసిరారు. ఏఐ సదస్సు లాంటి అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల వద్ద నిరసనలకు దిగుతూ భారతీయ యువతకు అవకాశాలను కాంగ్రెస్ తగ్గిస్తోందన్నారు. అనవసరమైన చోట్ల ప్రతాపాన్ని చూపిస్తున్న రాహుల్ గాంధీ, పార్లమెంటు నుంచి మాత్రం పారిపోతున్నారని కేంద్ర హోంమంత్రి విమర్శించారు. ఇలా చేస్తున్నందుకు భారత ప్రజలు రాహుల్‌ను క్షమించరన్నారు.

**ఆరోగ్య రంగంలో అసోం స్వయం సమృద్ధి**

"అసోంను ఆరోగ్య రంగంలో వికసిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం హిమంత బిస్వ శర్మ చాలా శ్రమిస్తున్నారు. ఆయన శ్రమ వల్లే ఇప్పుడు అసోం ఆరోగ్య రంగంలో స్వయం సమృద్ధిని సాధించింది. అసోం ప్రజలు మెరుగైన వైద్యం కోసం రాష్ట్రం దాటి వెళ్లకుండా స్థానికంగానే వైద్య వసతులను కల్పించాలనేది తన లక్ష్యమని సీఎం హిమంత నాతో చెప్పారు. బంగాల్, ఈశాన్య రాష్ట్రాల పేద రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించే స్థాయికి అసోంను తీసుకెళ్లాలనే విజన్‌తో హిమంత ఉన్నారు. గతంలో అసోం ప్రజలు క్యాన్సర్ చికిత్స కోసం చెన్నై, ముంబయి, కర్ణాటక, దిల్లీలకు వెళ్లేవారు. కానీ ఇప్పుడు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఆ చికిత్సను పొందుతున్నారు" అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపారు.

**అమిత్‌షా ప్రారంభించిన ప్రాజెక్టులు, పనులు ఇవే!**

గువహటిలో కొత్తగా నిర్మించిన ప్రాగ్జ్యోతిష్‌పూర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌ను అమిత్‌షా ఈసందర్భంగా ప్రారంభించారు.

గోలాఘాట్, తీన్ సుకియా క్యాన్సర్ సెంటర్లను హోంమంత్రి ప్రారంభించారు.

దిఫూ, జోర్హట్, బార్పేటలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్స్ నిర్మాణ పనులకు అమిత్‌షా వర్చువల్‌గా పునాది రాయి వేశారు.

గువహటిలోని సిక్స్ మైల్ ఏరియాలో స్వాస్థ్య భవన్, అభయపురి జిల్లా ఆస్పత్రి నిర్మాణ పనులకు కేంద్ర హోంమంత్రి పునాది రాయి వేశారు.

# ఎలక్షన్ నోటిఫికేషన్‌కు ముందు మమత కీలక ప్రకటన

బంగాల్ ఎన్నికల షెడ్యూల్‌పై కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం ప్రకటన చేయడానికి కొన్నిగంటల ముందు సీఎం మమతా బెనర్జీ కీలక ప్రకటన చేశారు. హిందూ పురోహితులు, ముస్లిం ముఅజ్జిన్‌ల నెలవారీ గౌరవ వేతనాన్ని మరో రూ.500 చొప్పున పెంచుతున్నట్లు ఆమె వెల్లడించారు. దీని ప్రకారం ఇకపై బంగాల్‌లోని పురోహితులు, ముఅజ్జిన్‌లకు ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.2వేల గౌరవ వేతనం లభించనుంది. ఈమేరకు వివరాలతో ఎక్స్ వేదికగా సీఎం మమతా బెనర్జీ ట్వీట్ చేశారు. పురోహితులు, ముఅజ్జిన్‌ల గౌరవ వేతనాలను పెంచే ఆదేశాన్ని ఇచ్చినందుకు తనకు సంతోషంగా ఉందని ఆమె వెల్లడించారు. ఈ సమాజపు ఆధ్యాత్మిక, సామాజిక జీవితాల కోసం పురోహితులు, ముఅజ్జిన్‌లు ఎన్నో సేవలు అందిస్తున్నారని మమత కొనియాడారు. గౌరవ వేతనం కోసం పురోహితులు, ముఅజ్జిన్‌లు కొత్తగా సమర్పించిన అన్ని దరఖాస్తులనూ ఆమోదించామన్నారు. మత సామరస్యం, సంప్రదాయ వ్యవస్థలకు మద్దతు అనేవి తమ ప్రభుత్వానికి అత్యంత కీలకమైన అంశాలని ఆమె స్పష్టం చేశారు. ప్రతీ సామాజిక వర్గం, సంప్రదాయం వర్ధిల్లే అనుకూల వాతావరణాన్ని ఏర్పర్చేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సుసంపన్నమైన మన ఆధ్యాత్మిక వారసత్వానికి సంరక్షణకర్తలుగా వ్యవహరిస్తున్న పురోహితులు, ముఅజ్జిన్‌లు గౌరవ వేతనాలకు అర్హులని సీఎం మమత చెప్పారు.

**ఈనెల నుంచే ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ బకాయిలు**

"మాది మా – మాటీ – మనుష్ ప్రభుత్వం. మేం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం. ప్రభుత్వ విద్యాసంస్థల లక్షలాది టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల్లోని ఎయిడెడ్ విద్యా సంస్థల ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన వాగ్దానాలను కూడా నిలబెట్టుకున్నాం. వాళ్లంతా ఆర్ఓపీఏ 2009 కరవు భత్యం (డీఏ) బకాయిలూ 2026 మార్చి నెల నుంచి అందుకుంటారు. రాష్ట్ర ఆర్థిక శాఖ



విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులకు డీఏ బకాయిలు అందుతాయి" అని సీఎం మమత వెల్లడించారు.

**సుప్రీం కోర్టు ఆదేశాల ఎఫెక్ట్**

ఐదో వేతన సంఘం సిఫారసులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల చెల్లింపులు, ప్రయోజనాలలో సవరణలు చేసేందుకు రూపొందించిన మార్గదర్శకాలనే రివిజన్ ఆఫ్ పే అండ్ అలవెన్స్ (ఆర్ఓపీఏ) అంటారు. వీటిని అమలు చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తూ బంగాల్‌కు చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆర్ఓపీఏ మార్గదర్శకాల ప్రకారం 2008 ఏప్రిల్ 1 నుంచి 2019 డిసెంబరు 31 వరకు పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం బకాయిలను ఉద్యోగులు, పెన్షనర్లకు అందించాలని కోరింది. ఉద్యోగ సంఘం వాదనతో ఏకీభవించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, 2026 మార్చి 31లోగా 25 శాతం డీఏ బకాయిలను విడుదల చేయాలని బంగాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని 2025 మేలో ఆదేశించింది. మిగతా 75 శాతం డీఏ బకాయిలపై నిర్ణయాన్ని తీసుకోవడానికి నలుగురు రిటైర్డ్ జడ్జీలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయమని బంగాల్ సర్కారుకు సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఈనేపథ్యంలో డీఏ బకాయిలను ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అందించాలని సీఎం మమత ఆదేశాలు జారీ చేశారు. ఈనెలలోనే వాళ్లందరికీ డీఏ బకాయిలు అందుతాయని వెల్లడించారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల వేళ ఉద్యోగులు, పెన్షనర్లను ప్రసన్నం చేసుకునేందుకే మమత ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బంగాల్ ఎన్నికల షెడ్యూల్‌పై ఈసీ ప్రకటన తర్వాత ఆదివారం సాయంత్రం నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది.

## విదేశాల్లో ఉన్న సొంత పౌరుల రక్షణలో భారత్ మేటి




ప్రపంచంలోని ఏ మూలన సంక్షోభం తలెత్తినా, యుద్ధ మేఘాలు కమ్ముకున్నా... అక్కడ చిక్కుకుపోయిన తమ పౌరులను కాపాడుకోవడంలో భారత్ అత్యంత చురుగ్గా, వేగంగా స్పందించే దేశంగా ముందు వరుసలో నిలుస్తోందని ఓ తాజా నివేదిక ప్రశంసించింది. ఈ విషయంలో భారత ప్రభుత్వం చూపుతున్న నిబద్ధత, సమన్వయంతో కూడిన భారీ తరలింపు చర్యలు ప్రపంచవ్యాప్తంగా దేశ కీర్తిని పెంచుతున్నాయని 'టైమ్స్ కువైట్' తన కథనంలో పేర్కొంది. కేవలం తమ పౌరులనే కాకుండా, అత్యవసర సమయాల్లో విదేశీ యులను సైతం సురక్షితంగా తరలించి భారత్ తన మానవతా దృక్పథాన్ని, అంతర్జాతీయ సంఘీభావాన్ని చాటుకుంటోందని ఆ నివేదిక కొనియాడింది. వేగవంతమైన దౌత్యపర మైన చర్చలు, ప్రభుత్వ ఏజెన్సీల మధ్య అద్భుతమైన సమన్వయం, సమర్థవంతమైన సైనిక లాజిస్టిక్స్‌తో వేలాది మంది భారతీయులను ప్రమాదకర పరిస్థితుల నుంచి సురక్షితంగా స్వదేశానికి చేర్చగలిగిందని వెల్లడించింది. ఇటీవలి కాలంలో చేపట్టిన ఆపరేషన్ రాహత్, ఆపరేషన్ సంకట్ మోచన్, ఆపరేషన్ గంగ, ఆపరేషన్ కావేరి వంటివి ఇందుకు నిదర్శనమని నివేదిక వివరించింది. 2025 మధ్యలో ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సింధు' పేరుతో తమ పౌరులను సురక్షితంగా తరలించింది. సంక్షోభ ప్రాంతంలోని వారిని ముందుగా పొరుగున ఉన్న అర్మేనియాకు తరలించి, అక్కడి నుంచి ప్రత్యేక విమానాల్లో భారత్‌కు తీసుకొచ్చారు. ఈ తరలింపు ప్రక్రియ చాలా సాఫీగా, చక్కటి ప్రణాళికతో జరిగిందని, ప్రయాణ ఏర్పాట్లు చేసేంత వరకు సౌకర్యవంతమైన వసతి కల్పించారని స్వదేశానికి తిరిగి వచ్చిన వారు తెలిపినట్లు నివేదికలో పేర్కొన్నారు. భారత రాయబార కార్యాలయం అందించిన సహాయం చూసి తాను ఆశ్చర్యపోయానని కశ్మీర్‌కు చెందిన సెహ్రిష్ రఫీక్ చెప్పినట్లు టైమ్స్ కువైట్ ఉటంకించింది. 'మా కోసం రాయబార కార్యాలయం ఇంతలా శ్రమిస్తుందని నేను మొదట నమ్మలేకపోయాను. కశ్మీరీలు అందరూ భారత ప్రభుత్వానికి నిజంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు' అని ఆమె అన్నారు. ఈ ఆపరేషన్ ఎంతో సహాయకారిగా ఉందని, తమ భద్రతకు భరోసా ఇచ్చిన ఎంబసీకి పుల్వామాకు చెందిన మీర్ మహ్మద్ ముషారఫ్ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, రష్యా–ఉక్రెయిన్ యుద్ధ సమయంలో భారత్ 'ఆపరేషన్ గంగ'ను ప్రారంభించి రికార్డు స్థాయిలో తరలింపు చేపట్టింది. ఈ ఆపరేషన్ ద్వారా 23,000 మందికి పైగా భారత పౌరులతో పాటు 18 దేశాలకు చెందిన 147 మంది విదేశీయులను కూడా సురక్షితంగా తరలించింది. పౌరులను మొదట పోలాండ్, రొమేనియా, హంగరీ, స్లోవేకియా, మోల్డోవా వంటి పొరుగు దేశాలకు చేర్చి, అక్కడి నుంచి ప్రత్యేక పౌర, సైనిక విమానాల్లో భారత్‌కు తీసుకొచ్చారు.

**అదే మా ప్రథమ ప్రాధాన్యత: భారత విదేశాంగ శాఖ**

"విదేశాల్లోని భారత పౌరుల భద్రత, శ్రేయస్సే మా ప్రథమ ప్రాధాన్యత. వారిపై ప్రతికూల ప్రభావం చూపే పరిణామాలను మేము ఉపేక్షించలేము" అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. గతంలో అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతల సమయంలోనూ భారత ప్రభుత్వం అక్కడి పరిణామాలను నిశితంగా గమనిస్తూ, పౌరుల తరలింపునకు అన్ని మార్గాలను అన్వేషించింది. స్వదేశానికి తిరిగి రావాలనుకునే వారి కోసం విమాన ఛార్జీలను స్థిరంగా, అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంది. ఈ నిరంతర ప్రయత్నాలు, మానవతావాదంతో కూడిన స్పందన... బాధ్యతాయుతమైన ప్రపంచ శక్తిగా భారత్ స్థానాన్ని మరింత పటిష్టం చేస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కాన్షీరామ్‌కు 'భారతరత్న' ఇవ్వండి

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు, బహుజన నేత కాన్షీరామ్‌కు మరణానంతరం భారతరత్న పురస్కారం ప్రదానం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రధానికి ఓ లేఖ రాశారు. కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని, ఆయన సేవలను స్మరించుకుంటూ ఈ విజ్ఞప్తి చేస్తున్నట్టు రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. భారత రాజకీయాల స్వరూపాన్నే కాన్షీరామ్ మార్చారని రాహుల్ కొనియాడారు. తన ఉద్యమాల ద్వారా బహుజనుల్లో, పేదల్లో రాజకీయ చైతన్యం నింపారని తెలిపారు. వారి ఓటు, గళం, ప్రాతినిధ్యం ఎంతో ముఖ్యమని గుర్తుచేశారని, ఈ దేశం అందరిదీ అని చాటిచెప్పారని వివరించారు. ఆయన కృషి వల్లే ఎందరో అణగారిన వర్గాల ప్రజలు రాజకీయాలను న్యాయం, సమానత్వం సాధించే మార్గంగా చూడటం ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడికి రాజ్యాంగం సమానత్వం, గౌరవం, భాగస్వామ్యం కల్పించిందని, ఆ హామీలను సమాజంలో అట్టడుగున ఉన్నవారికి అందించేందుకు కాన్షీరామ్ తన జీవితాన్ని అంకితం చేశారని రాహుల్ గుర్తుచేశారు. ఇటీవల లక్నోలో జరిగిన 'సామాజిక్ పరివర్తన్ దివస్' కార్యక్రమంలోనూ ఈ డిమాండ్‌కు బలమైన మద్దతు లభించిందని ప్రధానికి రాసిన లేఖలో ప్రస్తావించారు. 2027లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, కాంగ్రెస్ ఈ అంశాన్ని లేవనెత్తడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కాన్షీరామ్‌కు భారతరత్న ప్రకటించడం ఆయన దేశానికి చేసిన సేవలకు దక్కే నిజమైన గౌరవమని, ఆయనను సాధికారతకు చిహ్నంగా భావించే కోట్లాది మంది ఆకాంక్షలను నెరవేర్చినట్టు అవుతుందని రాహుల్ తన లేఖను ముగించారు. అయితే, రాహుల్ డిమాండ్‌పై బీఎస్పీ అధినేత్రి మాయావతి విమర్శలు గుప్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి దళిత ఐకాన్‌ల గుర్తింపు విషయంలో కాంగ్రెస్ పార్టీ గత రికార్డును ఆమె ప్రశ్నించారు.

## విజయ్‌కు బీజేపీ భారీ ఆఫర్ డిప్యూటీ సీఎం పదవి, 80సీట్లు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ వేడి రాజుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో విజయ్? పార్టీ పొత్తు ఉంటుందనని గత కొన్ని రోజులుగా వార్తలొస్తున్నాయి. ఈ క్రమంలో బీజేపీతో కలిసి పోటీ చేసే ప్రసక్తే లేదని టీవీకే పార్టీ స్పష్టం చేసింది. అయినా ఈ పొత్తు వార్తులు వస్తూనే ఉన్నాయి. తాజాగా విజయ్?కు బీజేపీ డిప్యూటీ సీఎం ఆఫర్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. పొత్తులో భాగంగా టీవీకేకు 80 సీట్లు ఇవ్వనున్నట్లుగా సమాచారం.

**తుదిదశలో బీజేపీ--టీవీకే చర్చలు**

తమిళనాడు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ, టీవీకే మధ్య సీట్ల పంపకం చర్చలు తుదిదశకు చేరుకున్నాయని వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందం కుదిరితే రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక విజయ్ మాత్రం భవిష్యత్తులో ముఖ్యమంత్రి పదవిని లక్ష్యంగా పెట్టుకున్నారని సమాచారం. ఈ అంశం కూడా ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**విజయ్ అభిమాన ఓటు బ్యాంకుపై బీజేపీ దృష్టి**

ఎన్‌డీఏలోకి విజయ్ పార్టీని తీసుకురావడానికి బీజేపీ పలు మార్గాల్లో ప్రయత్నాలు చేస్తున్నట్లుగా సమాచారం. విజయ్‌తో సంప్రదింపులు కొనసాగించేందుకు ఇతర రాష్ట్రానికి చెందిన ఒక డిప్యూటీ ముఖ్యమంత్రి కూడా మధ్యవర్తిగా పనిచేస్తున్నారని తెలుస్తోంది. తమిళనాడులో విజయ్?కు భారీగానే అభిమానులు ఉన్నాయి. ఇదే ఇప్పుడు బీజేపీకి కీలకంగా మారవచ్చని పార్టీ వ్యూహకర్తలు భావిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో కేవలం 2 శాతం ఓట్ల మార్పు కూడా ఫలితాన్ని ప్రభావితం చేయగలదని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. అయితే ఎన్‌డీఏతో పొత్తుపై విజయ్‌కు దగ్గరగా ఉన్న కొందరు సలహాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. స్వతంత్ర రాజకీయ ప్రత్యామ్నాయంగా ప్రజల ముందుకు వచ్చిన కొత్త పార్టీగా టీవీకే తన ప్రతిష్ఠను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు. ప్రారంభ దశలోనే జాతీయ కూటమిలో చేరితే పార్టీ ఇమేజ్ దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తున్నట్లుగా సమాచారం.

# స్వచ్ఛత డ్రైవ్ కొనసాగుతుంది

: మేయర్ మహంకాళి స్వామి
గోదావరిఖని పుష్కర ఘాట్ వద్ద 'సన్‌డే--ఫన్‌డే'తో ప్రత్యేక శుభ్రత కార్యక్రమం



**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన స్వచ్ఛత డ్రైవ్‌ను ఇకముందూ కొనసాగిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుండి 15 వరకు నిర్వహించిన సానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ చివరి రోజు ఆదివారం గోదావరిఖని పుష్కర ఘాట్ వద్ద "సన్‌డే--ఫన్‌డే" థీమ్‌తో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయం నుంచి వచ్చిన జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణ శ్రీ, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది కలిసి గోదావరి నదిలో పేరుకుపోయిన చెత్తను తొలగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ రామగుండంను స్వచ్ఛతకు మారుపేరుగా తీర్చిదిద్దడమే తమ పాలక వర్గం లక్ష్యమని తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని లక్షలాది భక్తులు రానున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్ల కోసం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు సర్వే చేసి డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. సుమారు రూ.150 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రామగుండంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. గోదావరి తీరాన్ని ప్రతి నెల ఒకసారి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి శుభ్రం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్, కమిషనర్ అరుణ శ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను నగరంలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.సుమారు 500 మంది స్వచ్ఛందంగా పాల్గొని నదిలో పడేసిన వ్యర్థాలను సంచుల్లో నింపి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. కార్యక్రమం మొత్తం మేయర్ స్వయంగా పర్యవేక్షిస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ప్రతినిధులు రాజేందర్, సారయ్య నేతృత్వంలో పాల్గొన్న వారికి అల్పాహారం అందించారు.అనంతరం నగర పాలక సంస్థ కార్యాలయం వెనుక ఖాళీ స్థలంలో మొక్కలు నాటారు. పచ్చదనం పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మేయర్ సూచించారు. తర్వాత మున్సిపల్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే సప్తగిరి కాలనీలోని ఎస్సీ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేధం, తడి--పొడి చెత్త వేరు చేయడం పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎస్ఈ గురువీర, ఈఈ పి.వి.రామన్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్వో ఆంజనేయులు, ఏసీపీ శ్రీహరి, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, అకౌంటెంట్లు రాజ్‌కుమార్, రవితేజ, మెప్మా టీంసీ మౌనిక, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన న్యాయవాది మహేష్ కుమార్ కు శుభాకాంక్షలు



రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడిగా న్యాయవాది మహేష్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి పలువురు ఆమనగల్ బార్ కౌన్సిల్ సభ్యులతో మహేష్ కుమార్ ను హైదరాబాద్ ఆయన నివాసంలో కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయవాదుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, న్యాయ వృత్తి అభివృద్ధి కోసం మహేష్ కుమార్ కృషి వెలకట్టలేనిదని అన్నారు. న్యాయ వృత్తిలో ఆయనకు ఉన్న అనుభవం, సేవా దృక్పథం వల్లే ఈ పదవికి ఎన్నికయ్యారని అన్నారు.న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడానికి, వారి సంక్షేమం కోసం కృషి చేస్తానని మహేష్ కుమార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ బార్ కౌన్సిల్ సభ్యులు మిర్యాణం సంతోష్, కారుకొండ మహేశ్వర్, గునవరం శివశంకర్ ,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాన్షిరామ్ జయంతి ఘనంగా మాదిగ శక్తి ఆధ్వర్యంలో నివాళులు



**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**

బహుజన నాయకుడు మాన్యవర్ కాన్షిరామ్ 92వ జయంతి వేడుకలను మాదిగ శక్తి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జండా కూడలిలో ఏర్పాటు చేసిన కాన్షిరామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి ఏర్పాటు చేసిన కాన్షిరామ్ నిలువెత్తు విగ్రహానికి మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్ని మాదిగ ముఖ్య అతిథిగా హాజరై పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారానికి దూరంగా ఉన్న అట్టడుగు జాతులను అధికారంలోకి తీసుకురావాలన్నదే కాన్షిరామ్ ఆశయమని తెలిపారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా చూపించిన మార్గం మన ముందే ఉందని, ఆ మార్గంలో నడిచినప్పుడే అట్టడుగు వర్గాలకు నిజమైన రాజ్యాధికారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాన్షిరామ్ ఆలోచనలకు అనుగుణంగా మాదిగ శక్తి పనిచేస్తుందని చెప్పారు.అనంతరం మాదిగ శక్తి సంస్థ లోగోను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మంద భాస్కర్ మాదిగ, తాడూరి శ్రీమాన్, కుక్క కనుకరాజ్, రామగిరి చంద్రమౌళి, బొడ్డుపల్లి రామ్మూర్తి, ఆర్నకొండ ఈశ్వర్, టాంక్ జై దేవ్ లడ్డు, పుల్లూరి మధు, కుక్క రవి, ఎం.పర్వతాలు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## వి.హెచ్.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాల ప్రారంభం



**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని బాటసారులు, వాహనదారులకు చల్లటి త్రాగునీరు అందించేందుకు వి.హెచ్.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో మూడు చోట్ల చలివేంద్రాలను ప్రారంభించారు. ఆదివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తా, బి పవర్ హౌస్, ఎనిమిదవ కాలనీలలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, వి.హెచ్.ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాటసారులు, వాహనదారులు, వృద్ధులు చల్లటి త్రాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జాహిద్ పాషా, యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడమల్ల శ్రీహరి, రోడ్డ సంపత్, ఎమ్మార్పీఎస్ నాయకులు కన్నూరి ధర్మేందర్, పల్లె బాపు, కాసిపేట సదానందం, వడ్లూరి శ్రీను, మార్పల్లి శ్రీను, బీఆర్ఎస్ యువ నాయకులు పోయిల రవి, అనిల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల చదువుతో చెలగాటం వద్దు

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలి
డా. మార్షల్ దుర్గం నగేష్

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**



ఎస్సీ, ఎస్టీ వర్గాల పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (న్యూ) పథకాన్ని కొనసాగిస్తూ వెంటనే అడ్మిషన్లు ప్రారంభించాలని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్: మార్షల్ దుర్గం నగేష్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.32 కోట్ల బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల ఈ ఏడాది ఒకటో తరగతి అడ్మిషన్ల నోటిఫికేషన్ నిలిచిపోయిందని అన్నారు. దీని వల్ల దాదాపు 60 మంది పేద విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వంటి పథకాల ద్వారా దశాబ్దాలుగా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని తెలిపారు. అయితే ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల పథకం నిలిచిపోవడం విచారకరమని పేర్కొన్నారు. అకడమిక్ సంవత్సరం ప్రారంభం కావస్తున్నా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. పేద విద్యార్థుల విద్యను నిర్లక్ష్యం చేయడం తగదని, ఇప్పటికే ఉన్న విద్యా పథకాలను నిర్వీర్యం చేయకుండా వాటిని బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలు విడుదల చేసి, ఒకటో తరగతి అడ్మిషన్ల నోటిఫికేషన్ జారీ చేయాలని, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఇతర వనరులను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం సమతా సైనిక దళ్ తరఫున ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని డా. మార్షల్ దుర్గం నగేష్ హెచ్చరించారు.

## నూకంబికా అమ్మవారి జాతరలో లైట్ల ప్రారంభం



**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం మండలంలో నిర్వహిస్తున్న నూకంబికా అమ్మవారి జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన లైట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మనాలి ఠాగూర్ హాజరై ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లైటింగ్ సదుపాయాలను ప్రారంభించారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో ఐమస్ లైట్లు ఏర్పాటు చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. అనంతరం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఆటోలకు బడ్జెట్ కేటాయించాలని ఎమ్మెల్యేను కోరిన ఆటో జేఏసీ

**అగ్నిధార న్యూస్ ,(పటాన్‌చేరు):**



ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే దస్తగిరి (చోటు) ఆధ్వర్యంలో నాయకులు పటాన్‌చేరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగూడాల సాయిలు మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆటో డ్రైవర్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యేను కోరారు. కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీలను నమ్మి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల ఆటో కుటుంబాలు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చాయని పేర్కొన్నారు. అయితే అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేపు ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లోనే ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు.

## బిటి రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే విజయరమణారావు

**అగ్నిధార న్యూస్,( పెద్దపల్లి)**
**సుల్తానాబాద్:**



కాల్వశ్రీరాంపూర్ ఆర్‌డబీ రోడ్డు నుండి సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీ వరకు నిర్మిస్తున్న బిటి రోడ్డు పనులను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదివారం పరిశీలించారు.రూ.1 కోటి 20 లక్షల నిధులతో చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

# కార్ల ధరలకు రెక్కలు!

## ప్రపంచంలోనే అధికంగా వంటగ్యాస్ ఉత్పత్తి చేసే దేశం




భారతదేశంలో సగటు సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేసే ప్రధాన అంశాల్లో గ్యాస్ ధర ఒకటి. ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు నేరుగా భారతీయులపై ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య నడుస్తున్న ఈ యుద్ధం ప్రపంచ ఇంధన మార్కెట్‌ను కుదిపేస్తోంది. ఈ నేపథ్యంలో చాలామంది సౌదీ అరేబియా లేదా రష్యా అతిపెద్ద గ్యాస్ ఉత్పత్తిదారులు అని భావిస్తారు. కానీ అసలు వాస్తవం ఏమిటో.. ప్రపంచంలో ఏ దేశం ఎక్కువగా వంటగ్యాస్ ఉత్పత్తి చేస్తుందో కింద చూద్దాం. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌పీజీ సరఫరాకు హార్మూజ్ జలసంధి అత్యంత కీలకమైన మార్గం. ప్రస్తుత ఉద్రిక్తతల కారణంగా ఈ షిప్పింగ్ కారిడార్‌లో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. రవాణా ఖర్చులు పెరగడం, ఇన్సూరెన్స్ ప్రీమియంలు అధికం కావడంతో భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాల్లో సిలిండర్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. చాలామంది సౌదీ అరేబియా లేదా రష్యా అతిపెద్ద ఉత్పత్తిదారులు అని భావిస్తారు, కానీ వాస్తవం వేరు. ప్రస్తుతం అమెరికా ప్రపంచంలోనే అగ్రగామి ఎల్‌పీజీ ఉత్పత్తిదారుగా అవతరించింది. అమెరికా ఏటా సుమారు 84 మిలియన్ టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేస్తోంది. అంటే ప్రపంచ మొత్తం ఉత్పత్తిలో దాదాపు 26% వాటా ఒక్క అమెరికాదే. చైనా 32 మిలియన్ టన్నులు, సౌదీ అరేబియా 26 మిలియన్ టన్నులతో వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి. రష్యా నాలుగో స్థానంలో ఉంది. కెనడా, ఇరాన్, ఖతార్, యూఏఈలు కూడా ఈ జాబితాలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి.

**ఎల్‌పీజీ అసలు ఎలా తయారవుతుంది?**

ఎల్‌పీజీ అంటే ప్రొపేన్, బ్యూటేన్ వాయువుల మిశ్రమం. ఇది ప్రధానంగా రెండు మార్గాల్లో లభిస్తుంది. భూమి లోపలి నుంచి సహజ వాయువును వెలికితీసేటప్పుడు ప్రొపేన్, బ్యూటేన్‌లను వేరు చేస్తారు. ఇతర మార్గాల్లో రిఫైనరీల్లో ముడి చమురును పెట్రోల్, డీజిల్‌గా మార్చే ప్రక్రియలో ఎల్‌పీజీ ఒక ఉప ఉత్పత్తిగా వస్తుంది.

**భారత్ పరిస్థితి ఏమిటి?**

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ఎల్‌పీజీ వినియోగదారుల్లో ఒకటి. ఉజ్వల యోజన వంటి పథకాలతో గ్యాస్ వినియోగం పెరిగినప్పటికీ మన దేశీయ ఉత్పత్తి డిమాండ్‌కు సరిపోవడం లేదు. భారత్ తన అవసరాల కోసం ప్రధానంగా పశ్చిమ ఆసియా దేశాల నుంచి దిగుమతులపైనే ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగినప్పుడు లేదా సరఫరా గొలుసు దెబ్బతిన్నప్పుడు దాని ప్రభావం నేరుగా దేశీయ సిలిండర్ ధరలపై పడుతోంది.




**న్యూఢిల్లీ :** కార్ల ధరలకు మళ్లీ రెక్కలురాబోతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా దేశీయ కరెన్సీ విలువ పాతాళంలోకి పడిపోయింది. దీంతో దేశీయ, అంతర్జాతీయ ఆటోమొబైల్ దిగ్గజ సంస్థలు తమ వాహన ధరలను పెంచడానికి మరోసారి సిద్ధమవుతున్నాయి. డాలర్, యూరోతో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనం చెందడంతోపాటు ఉత్పత్తి వ్యయం అధికం కావడం వల్లనే వాహన ధరలు పెంచాల్సి వస్తున్నదని ఆటోమొబైల్ ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. వీటికి తోడు దేశవ్యాప్తంగా వంటగ్యాస్ కొరత కూడా తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతున్నదని, ఈ ఇబ్బందికర పరిస్థితులు ఆటోమొబైల్ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. సామాన్యుడికి ఊరట కల్పించాలనే ఉద్దేశంతో గతంలో కేంద్ర ప్రభుత్వం తక్కువ సీసీ సామర్థ్యం కలిగిన కార్లపై జీఎస్టీని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంతో వాహన సంస్థలు ధరలను భారీగా తగ్గించాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు పదిహేను రోజుల్లో క్రూడాయిల్ ధరలు 40 శాతానికి పైగా పెరిగాయి. దీంతో క్రూడాయిల్‌తో ఉత్పత్తి అయ్యే ఇంజిన్ ఆయిల్ కోసం అధికంగా వెచ్చించాల్సి రానుండటం కూడా ధరలు పెరగడానికి మరో కారణం. గత నెల చివర్లో 73 డాలర్లుగా ఉన్న బ్యారెల్ ధర ప్రస్తుతం 103 డాలర్ల స్థాయిలో కదలాడుతున్నది. సుమారుగా 30 డాలర్లు మేర పెరిగింది. పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు రోజురోజుకూ ముదురుతుండటంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లో ఆందోళన నెలకొన్నది. సమీప భవిష్యత్తులో బ్యారెల్ ధర 200 డాలర్లకు చేరుకునే అవకాశం ఉన్నదని అంచనాలు కూడా వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో చమురు దిగుమతులపై ఆధారపడుతున్న భారత్ లాంటి దేశాల ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ కూడా తన వాహన ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతో పాటు కరెన్సీలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో వాహన ధరలను 2 శాతం పెంచుతున్నట్టు మెర్సిడెజ్-బెంజ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) బ్రెండన్ సిస్సింగ్ తెలిపారు. యూరోతో పోలిస్తే రూపాయి విలువ భారీగా పడిపోవడంతోపాటు ఉత్పత్తి వ్యయం అధికం కావడంతో సంస్థపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలను స్వల్పంగా పెంచినట్టు చెప్పారు. పెరిగిన ధరలు వచ్చే నెల 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

**ఆడీ కార్లు మరింత ప్రియం**

లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ మరోసారి వాహన ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా వాహన ధరలను 2 శాతం వరకు సవరిస్తున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు కరెన్సీ తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థ రూ.43.23 లక్షల నుంచి రూ.2.34 కోట్ల లోపు ధర కలిగిన పలు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

# అసలుకు అచ్చుగుద్దినట్లు చేస్తే ఊరుకోం'

ప్రపంచవ్యాప్తంగా టిక్‌టాక్, క్యాప్‌కట్ వంటి యాప్‌లతో సంచలనం సృష్టించిన చైనా కంపెనీ 'బైట్‌డ్యాన్స్'కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తన ప్రతిష్టాత్మకమైన ఏఐ వీడియో జనరేషన్ మోడల్ 'సీడ్యాన్స్ 2.0' గ్లోబల్ లాంచ్‌ను కంపెనీ నిరవధికంగా నిలిపివేసింది. హాలీవుడ్ అగ్రశ్రేణి నిర్మాణ సంస్థల నుంచి కాపీరైట్ ఉల్లంఘన నోటీసులు రావడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

**వివాదానికి కారణం ఇదే..**

సీడ్యాన్స్ 2.0 సృష్టించే వీడియోలు అచ్చం హాలీవుడ్ భారీ బడ్జెట్ చిత్రాలను తలపిస్తున్నాయి. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన కొన్ని క్లిప్స్ చిత్ర పరిశ్రమను విస్మయానికి గురిచేశాయి. అందులో హాలీవుడ్ నటులు బ్రాడ్ పిట్, టామ్ క్రూజ్ మధ్య జరిగిన పోరాట దృశ్యాలు రియలిస్టిక్‌గా ఉన్నాయి. ఐకానిక్ క్యారెక్టర్లుగా పేరున్న స్పైడర్ మ్యాన్, వెనమ్ వంటి సూపర్ హీరోలతో పాటు ప్రముఖ యానిమేషన్ క్లిప్‌లను ఈ ఏఐ మోడల్ అత్యంత నాణ్యతతో సృష్టించింది. దాంతో తమ మేధో సంపత్తిని అనుమతి లేకుండా ఈ మోడల్‌కు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగించారని హాలీవుడ్ స్టూడియోలు మండిపడుతున్నాయి.

**హాలీవుడ్ దిగ్గజాల ధ్వజం**

ప్రముఖ నిర్మాణ సంస్థ డిస్నీ గత నెలలోనే బైట్‌డ్యాన్స్‌కు 'సీజ్ అండ్ డెసిస్ట్' (నిలిపివేత) లేఖను పంపింది. తమ కంటెంట్‌ను అనుమతి లేకుండా వాడుకున్నారని డిస్నీ ఆరోపించింది. మరోవైపు, పారామౌంట్ స్కైడాన్స్ సైతం రంగంలోకి దిగింది. 'స్టార్ ట్రెక్, ది గాడ్ ఫాదర్, సౌత్ పార్క్ వంటి మా ఐకానిక్ చిత్రాల హక్కులను బైట్‌డ్యాన్స్ ఉల్లంఘించింది' అని పారామౌంట్ స్పష్టం చేసింది. సీడ్యాన్స్ 2.0 ప్రస్తుతం చైనాలో మాత్రమే అందుబాటులో ఉంది. ఈ ప్లాట్‌ఫామ్‌ను ప్రొఫెషనల్ ఫిల్మ్ మేకింగ్, ఇ-కామర్స్,




అడ్వర్టైజింగ్ రంగాల్లో విప్లవాత్మక మార్పుల కోసం రూపొందించారు. ఒకవేళ ఇది గ్లోబల్ మార్కెట్లోకి వస్తే హాలీవుడ్ ఉనికికే ప్రమాదమని విశ్లేషకులు భావిస్తున్నారు.

స్పోర్ట్స్

# మాది ఐస్, ఫైర్ జోడీ కాదు..
# ఇద్దరం అగ్నికి అగ్ని తోడైనట్టే ఆడుతాం!

పొట్టి ప్రపంచకప్‌లో భారత జట్టు అభిషేక్ శర్మపై భారీ అంచనాలు పెట్టుకుంది. కానీ, అనూహ్యంగా సంజూ శాంసన్ శివాలెత్తిపోయాడు. తొలి బంతి నుంచే విరుచుకుపడే అభిషేక్‌ను కట్టడి చేయడంలో విజయవంతమైన ప్రత్యర్థి బౌలర్లు.. శాంసన్ ముప్పును ఊహించలేదు. ఫలితంగా.. మెగా టోర్నీలో ఈ పవర్ హిట్టర్ మ్యాచ్ విజేతగా అవరించాడు. అభిషేక్‌తో ఇన్నింగ్స్ ఆరంభించడంపై సంజూ మాట్లాడుతూ తమది ఐస్, ఫైర్ జోడీ కాదని.. తామిద్దరం అగ్నికి అగ్ని తోడైనట్టే ఆడుతామనిపేర్కొన్నాడు. టీ20 వరల్డ్‌కప్‌లో ఓపెనర్‌గా, మ్యాచ్ విన్నర్‌గా అదరగొట్టాడు సంజూ శాంసన్. లీగ్ దశలో ఒకటే మ్యాచ్ ఆడిన సంజూ.. సూపర్ 8లో ఎంట్రీ ఇచ్చి.. హ్యాట్రిక్ అర్ధ శతకాలతో భారత విజయాల్లో భాగమయ్యాడు. టీమిండియా మూడోసారి పొట్టికప్‌ను గెలవడంలో కీలకమైన ఈ కేరళ బ్యాటర్ తన ఓపెనింగ్ జో డీ అభిషేక్ శర్మ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. 'మాది ఐస్, ఫైర్ జోడీ కాదు. మేమిద్దరం ఫైర్ ఉన్న ఆటగాళ్లమే. కొన్నిసార్లు అభిషేక్ ఫైర్ అయితే.. నేను కొన్నిసార్లు ఫైరవుతా. మా ఇద్దరిది ఫైర్ జోడీ. 2024 నుంచి మేము ఇలానే ఆడుతున్నాం. మా ఇద్దరి మధ్య కేరళమ్ -- పంజాబీ స్నేహం ఉంది. కాబట్టి మా ఇద్దరి మధ్య సంభాషణ సహజంగానే ఉంటుంది. మేము ఏ విషయాన్ని పెద్దదిగా చేయం. 'బాల్ ఎలా వస్తుంది?' అని అభిషేక్ నన్ను అడుగుతాడు. నేను 'బంతి మామూలుగానే వస్తోంది. సిక్సర్ బాదు' అని చెబుతాను. ఇలా.. అతడితో ఓపెనింగ్ చాలా సౌకర్యంగా అనిపిస్తుంది. అభిషేక్ చాలా ధైర్యవంతుడు. అన్ని



రకాల షాట్లు ఆడగల సమర్థుడు. అతడి స్వభావం అంటే నాకు ఇష్టం. మైదానంలోపలా అతడితో భాగస్వామ్యాన్ని, మైదానం బయటా అతడితో స్నేహాన్ని నేను చాలా ఇష్టం పడుతా' అని శాంసన్ వెల్లడించాడు.

**ఫైనల్లో 89**

సొంతగడ్డపై జరిగిన టీ20 ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా అభిషేక్ శర్మ విఫలమైనా సంజూ శాంసన్ మెరిశాడు. క్వార్టర్ ఫైనల్ లాంటి సూపర్ 8 చివరి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై 97 నాటౌట్‌లో జట్టును గెలిపించాడు. ఆపై సెమీఫైనల్లోనూ అభిషేక్ త్వరగా ఔటైనా.. ఇంగ్లండ్ బౌలర్లను కాచుకున్న సంజూ 89 పరుగులతో రెచ్చిపోయాడు. ఫైనల్లోనూ ఈ కేరళ స్టార్ దంచేశాడు. న్యూజిలాండ్ బౌలర్లను బాదేస్తూ అభిషేక్(52)తో కలిసి తొలి వికెట్‌కు 98 రన్స్ జోడించిన సంజూ హాఫ్ సెంచరీ( 89 పరుగులు)తో జట్టుకు భారీ స్కోరందించాడు. ఇషాన్ కిషన్(54), ఆఖర్లో శివం దూబే(26 నాటౌట్) ధనాధన్ ఆటతో కివీస్‌కు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా. అనంతరం.. బుమ్రా(4-15), అక్షర్ పటేల్(3-27) విజృంభణతో బ్లాక్ క్యాప్స్ 159కే కుప్పకూలింది. 96 పరుగుల తేడాతో జయకేతనం ఎగురవేసిన భారత జట్టు పొట్టిప్రపంచకప్‌ను నిలబెట్టుకుంది.

## 'అభిషేక్‌ను అందుకే వెనుకేసుకొచ్చా'

ఇటీవలే ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో అభిషేక్ శర్మ బ్యాటింగ్ వైఫల్యం పెద్ద చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. టోర్నీ ఆరంభ దశ నుంచి సెమీస్ వరకు అభిషేక్ డకౌట్లు లేదా తక్కువ స్కోర్లకే వెనుదిరిగాడు. అయినా కూడా కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం అభిషేక్‌కు అవకాశాలిస్తూ అతడికి వెన్నుదన్నుగా నిలుస్తూనే వచ్చాడు. మ్యాచ్‌ల్లో వరుసగా విఫలమవుతున్నా జట్టులో చోటు కల్పించడంపై విమర్శలు కూడా వ్యక్తమయ్యాయి. అయితే గంభీర్ మాత్రం అభిషేక్‌పై పూర్తి నమ్మకం పెట్టుకున్నాడు. ఆ నమ్మకాన్ని నిజం చేస్తూ అభిషేక్ టీ20 ప్రపంచకప్ ఫైనల్లో కీలక ఇన్నింగ్స్ ఆడి అంతకముందు తనపై వచ్చిన విమర్శలన్నింటికీ సమాధానం చెప్పాడు. ఎన్ని విమర్శలు వచ్చినా అభిషేక్‌ను వెనుకేసుకు రావడానికి గల కారణాన్ని కోచ్ గౌతమ్ గంభీర్ తాజాగా వెల్లడించాడు. '2014 ఐపీఎల్ సమయంలో నేను



చాలా బ్యాడ్‌ఫేస్‌ను ఎదుర్కొన్నాను. అప్పట్లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో వరుసగా మూడు డకౌట్లు కావడంతో విమర్శలు ఎదురయ్యాయి. ఒక ఆటగాడు పరుగులు చేయలేదంటే అతని స్కోర్ కంటే ఫామ్ గురించే మాట్లాడుకుంటారు. కానీ నిజానికి అభిషేక్ అక్కడ ఫామ్ కోల్పోలేదు.. కేవలం పరుగులు మాత్రమే చేయలేకపోతున్నాడు. ఇదే విషయాన్ని అతడికి వివరించాను. అయితే అభిషేక్ క్రీజులో ఉన్నంత సేపు ధాటిగా ఆడే ప్రయత్నం చేస్తాడు. ఈ నేపథ్యంలోనే అతను తక్కువ బంతుల్లో ఎక్కువ పరుగులు చేయాలని ఆరాట పడుతుంటాడు. కానీ ఒక బ్యాటర్ 20 నుంచి 30 బంతులు ఆడినప్పుడు మాత్రమే అతని ఫామ్‌ను అంచనా వేయగలం. అయితే అభిషేక్ పట్టుమని 20 బంతులు కూడా ఎదుర్కోలేదు.

## మూడేళ్లుగా జట్టుకు దూరం.. అంతర్జాతీయ క్రికెట్‌కు మాజీ కెప్టెన్ వీడ్కోలు!



పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. దాదాపు మూడేళ్లుగా జాతీయ జట్టుకు దూరమైన సర్ఫరాజ్ రిటైర్మెంట్‌కు సమయం వచ్చిందని భావించాడు. ఇక ఆలస్యం చేయకూడదని ఆదివారం అతడు అల్విదా చెప్పేశాడు. దాంతో.. ఈ మాజీ సారథి 20 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ఎండ్ కార్డ్ పడింది. పాక్ జూనియర్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన సర్ఫరాజ్ సీనియర్ జట్టు కోచ్‌గా ఎంపికయ్యే అవకాశముంది. పాకిస్థాన్ క్రికెట్‌లో విజయవంతమైన సారథిగా చరిత్రకెక్కిన సర్ఫరాజ్ అహ్మద్ కెరీర్ ముగిసింది. అంతర్జాతీయంగా 100 మ్యాచుల్లో సారథిగా వ్యవహరించిన సర్ఫారాజ్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 'పాకిస్థాన్‌కు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో దక్కిన గొప్ప గౌరవం. అండర్ -19 జట్టును 2006లో ఛాంపియన్‌గా నిలపడం, 2017లో ఛాంపియన్స్ ట్రోఫీ విజయం.. పాక్ జెర్సీలో ప్రతి క్షణం ప్రత్యేకమైనదే. అన్ని ఫార్మాట్లలో పాకిస్థాన్ జట్టుకు కెప్టెన్సీ చేయడం ద్వారా నా కల నిజమైంది. నేను ఎల్లప్పుడూ భయం లేకుండా ఆడేందుకు ప్రయత్నించాను. అలానే.. జట్టులో ఐక్యత పెంచాను. బాబర్ ఆజాం, షాహీన్ అఫ్రిది, హసన్ అలీ.. తదితరులను మ్యాచ్ విన్నర్లుగా మలచడం నా కెప్టెన్సీలో సాధించిన గొప్ప విజయం నాపై నమ్మకం ఉంచినందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా. పాకిస్థాన్ క్రికెట్ నా గుండెకు చాలా చేరువగా ఉంటుంది. ఇకపై కూడా సాధ్యమైన విధంగా పాక్ క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తాను' అని సర్ఫరాజ్ తన వీడ్కోలు సందేశంలో పేర్కొన్నాడు.

**భారత జట్టుపై అరంగేట్రం**

కరాచీలో జన్మించిన సర్ఫరాజ్ అండర్-19 వరల్డ్‌కప్ హీరోగా సీనియర్ జట్టులోకి వచ్చాడు. వికెట్ కీపర్, బ్యాటర్‌గా 2007లో భారత జట్టుపై వన్డేల్లో అరంగేట్రం చేసిన సర్ఫరాజ్ కెరీర్ దాదాపు ఇరవయ్యేళ్లు సాగింది. మొత్తంగా 54 టెస్టులు, 117 వన్డేలు, 61 టీ20లు ఆడాడు. వికెట్ కీపర్‌గా రాణించి 315 క్యాచ్‌లు పట్టిన అతడు.. 56 మందిని స్టంపౌట్ చేశాడు.



## భార్య, గర్ల్‌ఫ్రెండ్ మధ్య 61వ బర్త్ డే వేడుక జరుపుకున్న అమీర్ ఖాన్

బాలీవుడ్ 'మిస్టర్ పర్‌ఫెక్ట్' అమీర్ ఖాన్ తన 61వ పుట్టినరోజును (మార్చి 14) కుటుంబ సభ్యుల మధ్య ఎంతో సంతోషంగా జరుపుకున్నారు. ఎలాంటి ఆడంబరాలు లేకుండా కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య ఆయన ఈ వేడుకను నిర్వహించడం విశేషం. ఇంట్లోనే జరిగిన ఈ సాదాసీదా సెలబ్రేషన్స్‌లో కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొని ఆనందంగా గడిపారు. ఈ వేడుకలో అమీర్ ఖాన్ ప్రియురాలు గౌరీ స్ప్రాట్‌తో పాటు ఆయన పిల్లలు జునైద్ ఖాన్, ఐరా ఖాన్, ఆజాద్ రావు ఖాన్ పాల్గొన్నారు. విశేషమేమిటంటే, అమీర్ ఖాన్ ఇద్దరు మాజీ భార్యలు రీనా దత్తా మరియు కిరణ్ రావు కూడా ఈ పుట్టినరోజు వేడుకలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అందరూ కలిసి ఆత్మీయంగా గడపడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన వీడియోను టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆయన తన భార్య సఫా బేగ్‌తో కలిసి ఈ వేడుకకు హాజరయ్యారు. వీడియోలో అమీర్ ఖాన్ సింపుల్‌గా స్ట్రిప్డ్ టీ–షర్ట్, బ్లాక్ ప్యాంట్‌లో కనిపించగా, గౌరీ స్ప్రాట్ గ్రీన్ కలర్ డ్రెస్‌లో మెరిశారు. కేక్ కట్ చేసే సమయంలో ఐరా ఖాన్ కొవ్వొత్తికి బదులుగా లైటర్ వెలిగించగా, అమీర్ దానిని ఊదుతూ నవ్వులు పూయించారు. అనంతరం ఐరా తన తండ్రి ముఖానికి కేక్ పూసి సరదాగా అల్లరి చేసింది. తర్వాత అమీర్ తన చేతులతో ముందుగా ఆజాద్‌కు, ఆ తర్వాత ఐరా, గౌరీ, జునైద్‌లకు కేక్ తినిపించారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ పఠాన్ స్పందిస్తూ, "అమీర్ భాయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఐరా ఖాన్ తన అగత్సు ఫౌండేషన్ ద్వారా మానసిక ఆరోగ్యంపై చేస్తున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయం" అని పేర్కొన్నారు. అమీర్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా సినీ పరిశ్రమ నుంచి కూడా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కిరణ్ రావు అమీర్ ప్రొడక్షన్ హౌస్ వీడియోను షేర్ చేస్తూ, "నా ఫరెవర్ సికందర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. అలాగే అమీర్ ఖాన్‌తో కలిసి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన కాజోల్ కూడా పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆయనకు విష్ చేశారు. ఇదిలా ఉంటే, లాల్ సింగ్ చడ్డా తర్వాత కొంత విరామం తీసుకున్న అమీర్ ఖాన్ గత ఏడాది 'సితారే జమీన్ పర్'తో మళ్లీ ఫామ్‌లోకి వచ్చారు. ప్రస్తుతం ఆయన నిర్మాణ రంగంలోనూ బిజీగా ఉన్నారు.ప్రస్తుతం సన్నీ డియోల్ నటిస్తున్న 'లాహోర్ 1947' చిత్రాన్ని అమీర్ ఖాన్ నిర్మిస్తున్నారు. అలాగే ఈ ఏడాది జనవరిలో విడుదలైన 'హ్యాపీ పటేల్: ఖతర్నాక్ జాసూస్'లో అతిథి పాత్రలో కనిపించారు.

## బాలీవుడ్‌లో మరో ఛాన్స్.. రాజ్‌కుమార్ రావుతో కీర్తి సురేష్ 'రఫ్తార్' రిలీజ్ డేట్ ఫిక్స్

సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన కీర్తి సురేష్ ఇప్పుడు బాలీవుడ్‌లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. తెలుగు, తమిళ భాషల్లో అగ్ర హీరోలతో సినిమాలు చేసిన ఆమె ఇటీవల హిందీ చిత్రాల్లో కూడా అవకాశాలు అందుకుంటోంది. ఈ క్రమంలో తాజాగా ఆమె నటించిన మరో హిందీ సినిమా 'రఫ్తార్' విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావుకు జంటగా కీర్తి సురేష్ నటించిన తాజా చిత్రం 'రఫ్తార్'. వెండితెరపై ఈ ఇద్దరూ కలిసి నటిస్తున్న తొలి చిత్రమిది. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే బాలీవుడ్‌లో మంచి నటుడిగా గుర్తింపు పొందిన రాజ్‌కుమార్ రావుతో కీర్తి జోడీ ఎలా ఉంటుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన విడుదల తేదీని ప్రకటించారు. 'రఫ్తార్' సినిమాను జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. యాక్షన్, ఎమోషన్ మిళితంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి. అమెజాన్ వీ+వీ స్టూడియోస్, ఎ క్యాంపె ఫిల్మ్స్ సంస్థలపై ఈ సినిమా రూపొందుతోంది. దర్శకుడు ఆదిత్య నింబల్కర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి రాజ్‌కుమార్ రావు భార్య పత్రలేఖ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు సినిమా నుంచి హీరో, హీరోయిన్ ఫస్ట్ లుక్‌లు విడుదల కాకపోయినా పోస్టర్‌ను బట్టి ఇది డెప్త్ ఉన్న కథగా ఉండబోతుందని తెలుస్తోంది. సినిమాలో రాజ్‌కుమార్ రావు ఓ యువకుడిగా కనిపించగా, అతనికి సమానంగా పోటీ ఇచ్చే బలమైన పాత్రలో కీర్తి సురేష్ కనిపించనుందని సమాచారం. ఈ చిత్రంలో రాజ్‌కుమార్ రావు, కీర్తి సురేష్‌తో పాటు అనురాగ్ ఠాకూర్, రోహన్ వర్మ, తన్యా మానిక్తలా, రజత్ కపూర్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కథకు అనుగుణంగా విభిన్నమైన పాత్రలు ఈ సినిమాలో ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే రాజ్‌కుమార్ రావు ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. త్వరలోనే ఆయన నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానున్న 'టోస్టర్' అనే సినిమాలో కనిపించనున్నారు. ఈ సినిమాలో ఆయన సరసన సన్యా మల్హోత్రా హీరోయిన్‌గా నటిస్తోంది. ఫరా ఖాన్, అభిషేక్ బెనర్జీ, అర్చనా పూరన్ సింగ్ వంటి నటీనటులు కూడా ఇందులో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మొత్తానికి 'రఫ్తార్' సినిమా ద్వారా కీర్తి సురేష్ మరోసారి బాలీవుడ్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ఆమెకు హిందీ చిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపు తీసుకువస్తుందా లేదా అనేది చూడాలి.



## ఆనంద్ దేవరకొండ బర్త్ డే.. వదినమ్మ రష్మిక స్పెషల్ విషెస్



ఇటీవలే టాలీవుడ్ జంట రష్మిక– విజయ్ దేవరకొండ వివాహబంధంలోకి అడుగుపెట్టారు. ఉదయ్‌పూర్ వేదికగా జరిగిన గ్రాండ్ వెడ్డింగ్‌లో ఈ లవ్ బర్డ్స్ ఒక్కటయ్యారు. ఇరువురి సంప్రదాయ పద్ధతుల్లో వీరిద్దరి పెళ్లి వేడుక గ్రాండ్‌గా జరిగింది. ఈ పెళ్లిలో ?అత్యంత సన్నిహితులు, బంధుమిత్రులు మాత్రమే సందడి చేశారు. తాజాగా ఇవాళ విజయ్ తమ్ముడు ఆనంద్ దేవరకొండ బర్త్ డే కావడంతో వదినమ్మ రష్మిక స్పెషల్ విషెస్ తెలిపింది. మరిది ఆనంద్ దేవరకొండతో కలిసి డ్యాన్స్ చేసింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ దేవరకొండతో పెళ్లి తర్వాత ఆనంద్ జరుపుకుంటోన్న తొలి పుట్టనరోజు కావడం మరో విశేషం.



## టాప్ ప్లేస్‌లో ఓజీ హీరోయిన్ మూవీ.. టాలీవుడ్ నిర్మాత ప్రశంసలు

ఓజీ హీరోయిన్ ప్రియాంక మోహన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం మేడ్ ఇన్ కొరియా. ఆర్.ఏ కార్తీక్ దర్శకత్వం వహించిన ఈ మూవీ మార్చి 12న నేరుగా నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చేసింది. తన కోరికతో కొరియా వెళ్లిన యువతి ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొందన్న కోణంలో ఈ మూవీని తెరకెక్కించారు. ప్రస్తుతం ఈ మూవీపై పలువురు స్టార్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. కోలీవుడ్ ప్రముఖులు ముఖ్యంగా ప్రియాంక మోహన్ నటనను కొనియాడుతున్నారు. తాజాగా ఈ చిత్రంపై టాలీవుడ్ నిర్మాత సూర్యదేవర నాగవంశీ సైతం ట్వీట్ చేశారు. మనసుకు నచ్చే అద్భుతమైన కథనం, దృశ్యాలు, ప్రియాంక మోహన్ పాత్రలోని అమాయకత్వం ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ప్రియాంక మోహన్ చాలా అద్భుతంగా నటించారని అన్నారు. డైరెక్టర్‌తో పాటు చిత్రబృందానికి అభినందనలు చెబుతూ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. ఈనెల 12న స్ట్రీమింగ్ వచ్చేసిన ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో దూసుకెళ్తోంది. ఇండియన్ సినిమాల జాబితాలో నంబర్‌వన్‌గా ట్రెండ్ ?అవుతోంది. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులో ఉంది. ఇంకెందుకు ఆలస్యం.. వెంటనే ఈ మూవీని ఓటీటీలో చూసి ఎంజాయ్ చేయండి.



## నభా నటేశ్ నాగబంధం.. నమోరే సాంగ్ రిలీజ్

విరాట్ కర్ణ, నభా నటేశ్, ఐశ్వర్య మీనన్ ప్రధానపాత్రల్లో వస్తోన్న తాజా నాగబంధం. ఈ మూవీకి అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ఈ సినిమాలో జగపతిబాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేశారు. నమో రే నమోరే అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఈ పాటకు శ్రీ హర్ష లిరిక్స్ అందించగా.. జునైద్ కుమార్ కంపోజ్ చేశారు. ఈ సాంగ్‌ను సింధూజ శ్రీనివాసన్, ఐశ్వర్య దరూరి
ఆలపించారు. ఈ మూవీని ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ పతాకంపై కిషోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా రిలీజైన నమో రే పాటను అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని ప్రతిబింబించే భారీ సెట్లో చిత్రీకరించారు. ఆ నారాయణుడిని కీర్తిస్తూ సాగే ఈ ఆధ్యాత్మిక పాటకు వెయ్యి మంది డ్యాన్సర్స్ పాల్గొనగా.. భారతీయ నృత్య కళల వైవిధ్యం, ఐక్యతను ప్రతిబింబించేలా అద్భుతమైన విజువల్స్‌తో ఆడియన్స్‌ను ఆకట్టుకుంటోంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com